క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించండి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

గుండాల: ఇల్లెందు నుంచి కొమరారం మీదుగా చెట్టుపల్లి వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేసినట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. అనేక ఏళ్లుగా మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన చెట్టుపల్లికి బస్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేటు వాహనాలలో అధిక కిరాయిలతో ప్రజలు తెలియాల్సి వస్తుందని ఆయన వెల్లడించారు. తక్షణమే బస్ సౌకర్యం కల్పించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

సబ్సిడీపై సోలార్ ప్లాంట్లు

చంద్రుగొండ: సబ్సిడీపై రైతులకు సోలార్ ప్లాంట్‌లు ఇవ్వనున్నట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు కార్యాలయంలో మండల అధికారులతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. చంద్రుగొండ, మద్దుకూరు, పోకలగూడెం గ్రామాల్లో ఉన్న 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 3 కిలోమీటర్ల లోపు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీపై ప్లాంట్‌లు మంజూరు చేయనున్నట్లు ఆమె వివరించారు. మొత్తం రూ.4 కోట్ల విలువతో నిర్మించే ఈ ప్లాంట్‌కు రైతులకు రూ.40 లక్షల భాగస్వామ్యం ఉంటుందన్నారు. రూ.3.60 కోట్లు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఇందుకు రైతు పేరున నాలుగు ఎకరాల పట్టా భూమి ఉండాలని, ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ప్రభుత్వమే నేరుగా రైతు నుంచి కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఆసక్తిగల రైతులు తహసీల్దార్, విద్యుత్‌శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ట్రాన్స్‌కో ఏఈ ఎంఎల్ నర్సింహారావు, ఏఓ వినయ్, డీటీ ప్రసన్న, ఐకేపీ ఏపీఎం సంతోష్‌కుమార్, ఎఫ్ఆర్ఓ ఎల్లయ్య పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

గుండాల: పాల్వంచలో జరిగిన జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడల్లో గుండాల గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ విద్యార్థులు ఫుట్ బాల్ పురుషుల విభాగంలో ద్వితీయ స్థానం, పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని తెలిపారు. తోటి విద్యార్థులు విజేతలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ ఇస్లావత్ సురేష్, వైస్ ప్రిన్సిపల్ రామచందర్ రావు, జ్యోష్ణ కళాశాల పీడీ, పోరిక బాబురావు, పీఈటీ బుచ్చయ్య కళాశాల, పాఠశాల బోధన, బోధనేతర విద్యార్థులను అభినందించారు.

స్వయంశక్తితో ఎదగాలి

మణుగూరురూరల్: మహిళలు స్వయంశక్తితో ఎదగాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా సేవ అధ్యక్షురాలు దుర్గం సుమతిరామచందర్ అన్నారు. సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని సింగరేణి ఆధ్వర్యంలో పీవీకాలనీ సీఈఆర్ క్లబ్‌లో మహిళలకు, సేవ సభ్యులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏరియా సేవ అధ్యక్షురాలు సుమతిరామచందర్ హాజరై పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం మహిళలు, యువతులు టగ్ ఆఫ్ వార్, బాల్‌త్రో, బాంబ్ ఇన్ ద సిటీ పోటీలు, బాలబాలికలకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన సుమతిరామచందర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ పీఓ సింగు శ్రీనివాస్, ఇల్లెందు లేడీస్ క్లబ్ సభ్యులు, సేవ కార్యదర్శి షకీర, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ, సేవ సభ్యులు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మణుగూరుటౌన్: సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు పాడుపుగంటి రమేశ్ గుండెపోటుతో మృతి చెందగా.. సహ ఉద్యోగులు శనివారం ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. జీఎం కార్యాలయ ఆవరణలో జీఎం దుర్గం రాంచందర్ చేతుల మీదుగా రూ.1.05 లక్షల నగదును బాధిత కుటుంబానికి ఎస్‌ఓ శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు. అలాగే తండ్రి చనిపోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఇద్దరు గార్డులు కేఆర్‌కే రాజుకు, కే.రామకృష్ణకు 15వేల చొప్పున అందించారు. పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కరకగూడెం: మండల పరిధిలోని చిరుమళ్ల గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు దోమల రమేష్ కుమారుడు ప్రణయ్ ఇటీవల మృతి చెందగా శనివారం మండల గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మృతిని కుటుంబ సభ్యులను వారి స్వగృహంలో పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. దశ దిన కర్మలకు ఆర్థిక సాయం అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు మొహమ్మద్ రఫీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి షురూ..!

- మార్కెట్లో సిద్ధంగా పండుగ సామగ్రి
- చర్చిలు, గృహాల వద్ద క్రిస్మస్ కాంతులు


దుకాణంలో శాంతాక్లాజ్ డ్రెస్, క్రిస్మస్ ట్రీలు..


అమ్మకానికి సిద్ధంగా ఉన్న క్రిస్మస్ స్టార్‌లు

సండే స్పెషల్

భద్రాచలంఅర్బన్: క్రిస్మస్ పండుగ యావత్ ప్రపంచానికే పర్వదినం. ఏసు ప్రభువు పుట్టిన రోజున క్రైస్తవులు పండుగ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. డిసెంబర్ 25న జరిగే క్రిస్మస్ పండగ కోసం ప్రార్థనా మందిరాలు అందంగా అలంకరిస్తుండగా.. గృహాల అలంకరణ వస్తువులు మార్కెట్‌ను ముంచెత్తాయి.

రంగురంగుల నక్షత్రాలు..

నిరుపేదల నుంచి ధనవంతుల వరకు ప్రతీ క్రిస్టియన్ తన ఇంటికి రంగు రంగుల స్టార్లను అలంకరించడం సంప్రదాయం. నేపథ్యంలోనే అనేక రకాల స్టార్స్ భద్రాచలం మార్కెట్లలో లభ్యమవుతున్నాయి. వీటి విలువ రూ.60 నుంచి రూ.650 వరకు ఉన్నాయి. స్టార్‌కు సంబంధించి విభిన్న రంగుల్లో విద్యుత్ దీపాలు లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో పేపర్, ప్లాస్టిక్, ఫైబర్, ఎస్ఈడీలతో చేసిన నక్షత్రాలు లభిస్తున్నాయి.

మెరిసే తోరణాలు..

మేరీ క్రిస్మస్, హ్యాపీ హ్యాపీ క్రిస్మస్ అనే ఇంగ్లీషు అక్షరాలను పేర్చి రూపొందించిన రంగు రంగుల తోరణాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటిల్లో ఫ్లవర్ల డిజైన్లు తళుక్కున మెరుస్తున్నాయి. శాంతాక్లాజ్ (క్రిస్మస్ తాత), యేసు ప్రభువు స్టిక్కర్స్ చాలా అందంగా ఉన్నాయి. క్రిస్మస్ తాత మాస్కులు, పూర్తి డ్రెస్‌లు లభిస్తున్నాయి.

కాంతులు వెదజల్లే క్రిస్మస్ ట్రీలు..

విద్యుత్ కాంతుల మధ్య వెలిగిపోతున్న క్రిస్మస్ ట్రీల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వీటిని రంగు రంగుల గ్రీటింగ్ కార్డ్స్, విద్యుత్ బల్బులను, చమ్కీ పూలతో అలంకరిస్తారు. క్రిస్మస్ బ్యానర్, బెలూన్స్, బెల్స్, క్రిబ్సెట్‌లు పలు మోడళ్లలో లభిస్తున్నాయి.

కొత్త డిజైన్లకే మొగ్గు..

ప్రతీ ఏడాది క్రిస్మస్‌కు తప్పని సరిగా అన్ని రకాల వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. దీంతో ఏటా కొత్తగా ఉండే వాటిని మా దుకాణంలో అందుబాటులో ఉంచుతున్నాం. క్రిస్మస్‌కు వారం రోజుల పాటు ఎక్కువగా గిరాకీ ఉంటుంది.

– సాయి కిరణ్, షాపు నిర్వాహకుడు, భద్రాచలం

యోగా, ధ్యానంతో ఒత్తిడి దూరం


అన్నపురెడ్డిపల్లి: ధ్యానం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అశ్వారావుపేటరూరల్: విద్యార్థులు యోగా, ధ్యానం చేయడం ద్వారా అనేక రకాల ఒత్తిడి దూరం అవుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ అరవింద్‌బాబు అన్నారు. శనివారం కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షలను ఒత్తిడికి లోనుకాకుండా రాయాలని, అప్పుడే ఆశించిన ఉత్తమ ఫలితాలు వస్తాయని తెలిపారు. అనంతరం హార్ట్‌ఫుల్ ఇనిస్టిట్యూట్ బాధ్యులు, వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.కోటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓడీ నరసింహారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): ధ్యానం జ్ఞాపకశక్తిని పెంచుతుందని మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఎర్రగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు ధ్యానం చేశారు. ధ్యానంతో జ్ఞాపకశక్తి మెరుగు పడటంతోపాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎంఈఓ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ ఎం.సీత, ఫిజికల్ డైరెక్టర్ జయరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ సంబురాలు


భద్రాచలంటౌన్: సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న నీటిపారుదల శాఖ ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని నీటిపారుదల శాఖ సర్కిల్ కార్యాలయంలో శనివారం సెమీ క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. నీటిపారుదల శాఖ జిల్లా కార్యదర్శి శ్యామల శ్రీనివాస్, టీఎన్జీవోస్ సెక్రెటరీ గగ్గూరి బాలకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాలుగవ తరగతి సంఘం అధ్యక్షుడు సాధిక్ పాషా, ట్రెజరర్ పడిగ నరసింహారావు, లింగమూర్తి, గాంధీ, పాపారావు, శ్రీనివాస్, వెంకట నరసయ్య, మల్లికార్జున్, ప్రసాద్, శ్రీదేవి, లక్ష్మి, చంద్రలేఖ, నిఖిత, శాంత, విజయ్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ సాజు సెబాస్టియన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సెయింట్ జాల్ ప్రావిన్స్, హెరాల్డ్స్ ఆఫ్ గుడ్‌న్యూస్ ఫాదర్ క్రీస్తు రాజు హాజరయ్యారు. ఏసు క్రీస్తు జననం తెలిపే నాటకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు అలరింపజేశారు. పాఠశాలలోని బోధన, బోధనేతర సిబ్బందికి, కరస్పాండెంట్ చేతులమీదుగా క్రిస్మస్ కానుకలను అందజేశారు.

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని సేయింట్‌జోసఫ్ పాఠశాలలో శనివారం సెమిక్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి విద్యార్థులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బీమా పథకాలను వినియోగించుకోవాలి

మణుగూరురూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్షాబీమా యోజన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్షా బీమా యోజన పథకాల ద్వారా రూ.2లక్షల వరకు బీమా వస్తుందని, బ్యాంకు ఖాతా కలిగిన 18నుండి 70 సంవత్సరాల లోపు వారు ఈ పథకాలకు అర్హులని తెలిపారు. ఆయా బ్యాంకులను సంప్రదించి ఆయా బీమా పథకాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, ఏపీఎం అహ్మదుల్లా పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

పాఠశాలల్లో శనివారం గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి, గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. విద్యార్థులకు గణిత క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. విద్యార్థులు గణితం ప్రయోగాత్మక మోడళ్లను ప్రదర్శించారు. గణిత ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థినులకు గణిత ప్రాధాన్యతపై రంగోళి పోటీలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: ఎగ్జిబిట్ వివరాలు వెల్లడిస్తున్న విద్యార్థి


భద్రాచలంటౌన్: విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు


మణుగూరురూరల్: శ్రీ చైతన్య పాఠశాలలో రంగవల్లిని దిద్దిన విద్యార్థినులు

పశువుల పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న జాయింట్ చెక్ పోస్టు వద్ద మూడు ఎద్దులను అక్రమంగా తరలిస్తున్న ట్రాలీ ఆటోను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి చెక్‌పోస్ట్ వద్ద 'తనిఖీల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నట్లు శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు చెక్‌పోస్ట్ సిబ్బందిని మందలించినట్లు తెలిసింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ట్రాలీలో భద్రాచలం సరిహద్దున ఉన్న ఎటపాక మండల పరిధిలో ఉన్న తోటపల్లి నుంచి కొత్తూడెం సుజాతనగర్ మండల పరిధిలో ఉన్న నరసింహానగర్‌కు పశువుల అక్రమ రవాణాను అడ్డుకున్నారు. తరలిస్తున్న వ్యక్తి పై పట్టణ పోలీసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతో పాటు పట్టుబడిన ఎద్దులను పాల్వంచలోని అన్నపూర్ణ గోసంరక్షణకు తరలించారు.

పర్సు అప్పగింత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ పరిధిలో దొరికిన పర్సును ఓ వ్యక్తి పోలీసుల సాయంతో పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించాడు. భద్రాచలం పట్టణంలో రగ్గులు, స్వెటర్లు అమ్మే రాజేష్‌కు రోడ్డుపై ఓ పర్సు దొరికింది. పర్సులోని కాగితంలో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా బాధితురాలిని రాజేష్ సంప్రదించి, శనివారం స్థానిక టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి ఆధ్వర్యంలో బాధితురాలు జయమ్మకు అప్పగించాడు.

సరిహద్దులు ఏర్పాటు

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామ శివారులో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు కేటాయించిన స్థలానికి తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సరిహద్దులను శనివారం ఏర్పాటు చేశారు. గ్రామంలోని సుమారు 35 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు గతంలో పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమికి సంబంధించి సరిహద్దులను ఏర్పాటు చేసే క్రమంలో ట్రెంచ్‌లను కొట్టించారు. గిర్దావర్ నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

గుండాల: ఈ నెల 28, 29, 30 తేదీల్లో నల్గొండలో నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకుడు బాలస్వామి పిలుపునిచ్చారు. సభలకు సంబంధించిన పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్.రూప్సింగ్, ఎస్ సురేష్, ఎస్.నరసింహారావు, బి.లక్ష్మణ్, బి.బాలాజీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసన

దుమ్ముగూడెం: కేంద్ర హోంమంత్రి అమిత్ షాను క్యాబినేట్ నుంచి వెంటనే తొలగించాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. కుంజా శ్రీనివాస్ రావు, లంకా శ్రీనివాసరావు, మట్టా శివాజీ, తోటమళ్ల సుధాకర్, తోట రమేష్, కెల్లా శేఖర్, కోర్స రాఘవ, జిరి సత్యనారాయణ, లంకా ప్రసాద్, అపకా నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ నాయకుల అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గుంపుల రవితేజ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్సైకి వినతిపత్రం అందించారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్

చర్ల: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే నేరాల సంఖ్య తగ్గుతుందని భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ అన్నారు. శనివారం మండలంలోని చింతగుప్పలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం, చట్టాలపై అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఇండియన్ పీనల్ కోడ్ కింద ఏ నేరానికి ఏ విధమైన శిక్ష ఉంటుందో తెలిసి ఉంటే నేరాలను చేసేందుకు ఎవ్వరూ ముందుకు రారని అన్నారు. మూఢ నమ్మకాలను వదిలిపెట్టి ప్రస్తుత సాంకేతికతను అలవరచుకోవాలని సూచించారు. పలువురు లాయర్లు మాట్లాడుతూ.. ఏ నేరానికి ఏ విధమైన శిక్ష పడుతుందోనని వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో లాయర్లు రామ్మోహనరావు, తిరుమలరావు, నాగరాజు, రమేష్, సతీష్, సంధ్య, శారధ చర్ల పోలీస్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ.రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ చైతన్య సత్యానారయణపురం వైద్యాధికారిణి డాక్టర్ దివ్యనయన తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్తమ ఉద్యోగులు వీరే..

మణుగూరుటౌన్: సింగరేణి డే వేడుకలను పురస్కరించుకుని ఉత్తమ సేవలు అందించిన కార్మికులు, ఉద్యోగులను ఎంపిక చేసినట్లు ఏరియా డీజీఎం పర్సనల్ రమేష్ తెలిపారు.

శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏరియా ఉత్తమ అధికారులుగా ఆకుమల్ల డీఏ ప్రశాంత్ డీవైఎస్ఈ (ఈఅండ్ఎం), పీకే ఓసీ-2, అనిల్ కుమార్ అడిషనల్ మేనేజర్ (మణుగూరు ఓసీ)లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉత్తమ ఉద్యోగులుగా నారెడ్ల సారంగపాణి ఈపీ ఆపరేటర్ (ఓసీ-2), కోమరి సంపత్, ఎలక్ట్రీషియన్ (కేసీహెచ్‌పీ), ఉత్తమ సేవా సభ్యులుగా మాధవి, రమాదేవి, కత్తార్‌లు, ఉత్తమ స్వయం ఉపాధి మహిళగా శౌరిని ఎంపిక చేశామన్నారు. వీరందరితోపాటు ఉత్తమ హరిత గృహాలంకరణ పోటీల్లో గెలుపొందిన వారికి ఏరియా జీఎం దుర్గం రాంచందర్ ఈ నెల 23న జరిగే ఆవిర్భావ వేడుకల్లో బహుమతులు అందజేస్తారని తెలిపారు.

ఇందిరమ్మ నమూనా గృహానికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

దుమ్ముగూడెం: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం ఇందిరమ్మ నమూనా గృహానికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టించి వారికి గూడు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, సీఐ అశోక్, హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఏఈ రాము, గిర్దావర్ కల్లూరి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటికి ఆహ్వానం..

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు హాజరు కావాలని ఆలయ ఈఓ ఎల్.రమాదేవి శనివారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దంపతులను ఆహ్వానించారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసిన ఈఓ ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రలను ఎమ్మెల్యే దంపతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ విద్యాసంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల (సీఆర్టీ) సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి బుటారి రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ సీఆర్టీలు నిర్వహిస్తున్న ధర్నాకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యుడు మునిగడప రామాచారిలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్ఆర్‌టీపీ, జగన్ యువ సైన్యం, అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ.. ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లోని అనారోగ్య బాధితులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కేకులను కట్ చేసి, ఒకరికొకరు ఆప్యాయంగా తినిపించుకున్నారు. జై జగన్, జైజై జగన్ అంటూ నినాదాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్


దుమ్ముగూడెం: జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో అభిమానులు..


భద్రాచలంటౌన్: కేక్‌కట్ చేస్తున్న నాయకులు, వృద్ధులు


దమ్మపేట: ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం


అశ్వారావుపేటరూరల్: నారాయణపురంలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు


చంద్రుగొండ: ఇమ్మడి రామయ్యబంజర్‌లో కేక్ కట్ చేస్తున్న జగన్ అభిమాని సాంబ


బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు


అశ్వాపురం: ఎస్సీ కాలనీలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు..


దమ్మపేట: వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అభిమానులు


చంద్రుగొండ ప్రధాన సెంటర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న అభిమానులు